# మడిపంచెలు ★

రచయిత :
... యస్. వి. జోగారావు ...

శుభలేఖ వచ్చింది. వెంకటి పెళ్ళంటే వెళ్ళక తప్పదు. వాడూ నేనూ ఇంటి దగ్గర గుడుగుడుగుంచంనుంచి బడిలో చెడుగుడుదాకా ఆడుకొన్న బాల్యమిత్రులం కాబట్టి. కాని జల్లికొడితే జేబులో దమ్మిడీ లేదు. నాన్న నడుగుదామంటే 'నీ పెళ్ళికి వాడు రానక్కరలేదు లే' అంటాడు. పోనీ మామ్మ సందుగులోంచి యేమేనా సంగ్రహిద్దామంటే కొండతవ్వి యెలకని పట్టాలన్నంతతంతు— మై గుడ్ గాడ్! మామ్మే నేను బరంపురం బయలుదేరుతున్నా ననుకుని ఆ వూళ్ళో ప్రసిద్ధి కాబట్టి మాంచి ప్రశస్తమైనవి జత నీరంచు మడిపంచెలు కొని తెమ్మని పెట్టెతీసి తను పునిస్త్రీగా వున్నప్పుడు పుచ్చుకున్న మంగళహారతి కట్నాలు వగైరాల మింజుమలె అయిదు రూపాయలు తక్కువ అర్ధనూట పదహారు తీసియిచ్చింది. తప్పకండా తెస్తానని నొక్కివక్కాణించాను. పాపం! రిక్షా యెక్కుతున్నప్పుడు గూడా మరీమరీ చెప్పింది. అవి తెచ్చిన వెంటనే మా తమ్ముడికి వదకపోచా, నాకు పెళ్ళిముడీ పడ్డానికి ప్రయత్నాలు ప్రారంభిస్తుందట నన్నుద్ధరించడానికే. అప్పుడనుకున్నాను పోనీ జతకాకపోయినా మంచిపంచె ఒకటేనా కొందామని.

బరంపురంలో పెళ్ళికి మా మిత్రబృందం బాజీ, సంజీవి, నాగులూ, జోగులూ కూడా వచ్చారు. వాళ్ళంతా యేవో కట్నాలు చదివిస్తున్నారు, పదులూ పాతికలూను. మన దగ్గిర మడిపంచెల బాపతు మినహా మరి తడి లేదు. పైగా నాగులూ జోగులూ నన్నడగొచ్చారు నువ్వెంత చదివిస్తావని. పంచరత్నాలన్నాను అంటే పద్యాలన్న మాట. నేను కాస్త కవిత్వంకూడా చెబుతాను లెండి! ఇలాంటి కట్నాల ప్రత్యామ్నా పనికొస్తుందని. అదీగాక మా తెలుగు మేష్టారిదగ్గరే పొడుంపట్లు నక్కికొట్టిన నాగులుగాడా నన్నడగడం? ఆజోగులుమాత్రం చదివించిందేమిటి? అక్షింతలు! ఇలాగే అనుకోండి మా కాలేజీరోజుల్లో నా పద్యాల్లో యతిప్రాసల్లాగ నన్ను ప్రయాసపెట్టేవారు యీ మైదాసు వెధవ లిద్దరూ వెరసి. విడిగా అయితే ఒక యతి అతికినా ప్రాసకోస మేడిసేవాడిని-కాను అంతగా.

## నిట్టూర్పు

ప్రణయమే ప్రమాదానికి దారితీస్తుంది. విరాగిని చేస్తుంది. త్యాగానికి ఉసిగొల్పుతుంది. ఈ నవలయందు స్త్రీ వలచినను పురుషుడు మిత్రునికై స్వార్థాన్ని గణించక త్యాగంచేయటం అపూర్వ విషయం. తానను కొన్నట్టు, తన్ను ప్రేమించినయువతి తన ఇష్టానుసారం మిత్రుని వివాహమాడి సౌఖ్యాన్ననుభవించక పోవటంచూచి చింతకులోనై తను మరుగైపోవుట విషాదపరిణామం. ఇది పాశ్చాత్య నవలా పద్ధతి ననుసరించి రచింపబడినది. తెలుగులో ఇట్టి నవలారచన కిదే ప్రథమం. చదువుటలో మైమరపును గల్గించును.

వెల 0—8—0 అణాలు.

చిత్రగుప్త ఆఫీసు,
6, లాయర్ చిన్నతంబి
మొదలివీధి, మద్రాసు.

లగ్నంరోజు కాస్తాఅయిపోయింది. ఇహ యింటి కెడతానన్నాను. వెంకటిగాడికన్నా మధ్య మా వెధవాయిల బలవంతం యెక్కువైంది. నాగులూ జోగులూ నాగవల్లినాడు వెళిపోదామన్నారు. ఈ శెల్లీగాడ్సుకి శేరం దొరికితే చాలు మరి కదల్రు సాంతం అయ్యేదాకా. అసలు వాడూ వెంకటి నన్ను ముఖమాటు పెట్టిందే యెలా వుండను? అంతకన్నా మన అభ్యంతరం యేం వుంది. ఇంటిదగ్గర మనకోసం యెదురు చూసేవా లెవరున్నారు మా మామ్మతప్ప. కాని మావాళ్ళు చిన్న 'ఎక్స్కర్షన్' చేదేసా వేద్దామన్నారు. సరే కానీం డన్నాను.

'తప్తపాణి' బరంపురంకి 30 మైళ్ళు. బస్సువుంది. అదంతా మన్యప్రాంతం. అన్నీ ఘాట్‌లూ, కొండలూ, అడవులూ, గడ్డలూను. వాటిమధ్య చిన్నకోయగూడెం-ఒక డాక్ బంగళా. అక్కడ ముఖ్యంగా చూడవలసింది ఒక మండీ—దానిమధ్య గంధకపు నీటివూటలు వేడిగా వస్తుంటాయి. అనీళ్ళు ఒక తూముగుండా కొండలోయల్లోకి సెలయేరులా పోతాయి. ఆ నీటిలో స్నానంచేస్తే 'శవాను'గా, హాయిగావుంటుంది. ఆరోగ్యం కూడాను— పెళ్ళికొడుకు వెంకటి రావటానికి వీల్లేకపోయింది. మిగతా మా ఐదుగురివీ స్నానా లయిపోయాయి. బంగళాకిపోయి కాస్త నాస్తా కడుపులో వేసుకుని మళ్ళా మధ్యాహ్నం మూడు గంటల బస్సు వచ్చే లోగా కొండకోనల్లోకి బయల్దేరాం.

బాజీ వెలంధోరగారు కాబట్టి చిన్న తుపాకీ తెచ్చాడు. కొంపదీసి కోయవాళ్ళయే లేగదూడనన్నా కొట్టాడంటే యిహ అక్కడ మా అభోరు దక్కదు. వాడి వెనక సంజీవి హేండు కెమెరాతో, జోగులు బైనాక్యులర్స్‌తోనూ పెద్ద 'ఎడ్వంచరర్స్' లాగ బయల్దేరాం. నాగులుగాడు వెనక్కి నక్కుతూ జామిపింజలు తెంపుతూ, రాలిపోయిన తుమ్మికపళ్ళూ, సిమిడిపళ్ళూ యేరుకుంటున్నాడు ద్రాపివెధవ. నేను మాత్రం పెద్దనగారి ప్రవరుడిలా అలా వెళిపోతున్నాను వట్టడవిలోకి. ఆ దృశ్యం అంతా చూస్తుంటే అవరూధిని యీనాడు రాకూడదా అనిపించింది. వచ్చినా ఎంత కామావేశంతోకూడా అలా నామీద కలియబడుతుందా ప్రబంధాల్లో చదవడం తప్ప. కవిగాణ్ణి కాబట్టి వనదేవతలేనా వినబడి ప్రత్యక్షమయ్యేటట్టు ఆశుగాయమకంపెట్టి ఒక్క కందపద్యం చెబుదామా అనిపించింది. నా తన్మయత్వం. దై

నుండ్ స్పేస్‌కూడా కరిగిపోయి వెళిపోతున్నాను హద్దుల్లేని అడివిలోకి మరిపించే మనస్సుతో.

అంతా ఒక అంతులేని అగాధం. నాలుగ్గుట్టల నట్టనడుమ ఒక కోనేరు. గట్టుమీద ఆవులూ, దూడలూ నెమరువేసుకుంటున్నాయి. కోనేట్లో గేదెలు యీదుతున్నాయి. గేదెలమీద కాకులు ఆడుకుంటున్నాయి. ఒకదుప్ప నన్ను దూసుకుని దూకుతూ పారిపోయింది. ఎక్కణ్ణుంచో కొండగొర్రె మూలుగు లీలగా వినబడుతోంది. ఆకుచిలకలు జామికొమ్మలమీద ఫీట్సు చేస్తున్నాయి. దొబ్బిపొదల్లో గోరువంకలు దోబూచులాడుకుంటున్నాయి. బూరుగుతొర్రలో తేనెపట్టు వుంది గామోసు. ఈగలు ముసురుతూ జుమ్మంటున్నాయి. ఇలాకనపడ్డ వనాన్నంతా వర్ణించుకుపోతున్నాను మనస్సులో. కోనేటికి కొద్దిదూరంలో ఒక పెద్ద గురివెంద చెట్టు, చెట్టుకిందరాలిన గింజల ఎఱుపు నలుపులు మసకమబ్బుల్లోని సంజకెంజాయల్లా వున్నాయి. చెట్టుకొమ్మలమీద తలకిందుగా తపస్సుచేస్తున్నాయి కొన్నిపక్షులు, ఇన్ని వింతలు కనిపించాయిగాని నా యిష్టదేవత భగవాన్ వీరహనుమాన్ బహద్దరుగారి అవతారమూ, మానవాకృతికి ఆదివిరాట్టూ ఐన మర్కట మహాభాగు డొక్కడూ కనిపించలేదు. అలా అనుకున్నంతలో దర్శనమిచ్చాడు. "వెయ్యేళ్ళాయుస్సు దేవా! మహానుభావా, హిడింబి బావా!" అనుకున్నాను గురివెంద చెట్టుచాటునే ఒక కోయపిల్ల ఆడిస్తున్న కోతిపిల్లనుచూసి. కాని భగవతిని చూసి భగవంతుణ్ణి మరిచిపోయాను. సరి నా కవిత్వానికి పులిస్టాపు. కోయసానిని చూసేసరికి విశ్వనాథ సత్యాలుగారి కిన్నెరసాని పాటలు నా కీచుగొంతుకతో ప్రసవవేదన పడుతున్నాయి. కాని యిదంతా "కలయో! వాయుజమాయయో! ఏమంటావు పోతన్నా! బొడ్డుంబాల్! అలసని పెదనా! ఏకాంతమునందు నున్న జవరాలు" అనుకున్నాను. "కాదుసుమా కలకాదు సుమా!" అంటున్నాయి కళ్ళు. హతోస్మి! దూరాన్నుంచి బస్సు హారన్! చెవికోసిన మేకలా నాగులుగాడి కేక! తప్పనిసరి! లుంగీ యెగ్గట్టాను దౌడుతియ్యడానికి. "దొరా దొరా!" అని వెనక కోయసాని పిలుపు. హారన్ పిలుపులో ఆత్రుతా, ఆమె పిలుపులో ఆశా నన్ను కలవరపెట్టాయి. అడుగులు తడబడ్డాయి. బరువుగా ఒక్కడుగు ముందుకివేశా. ముల్లుగుచ్చుకుంది. అబ్బా! పక్కనున్న కానుగమాను మీద పడిపోయా. నుదురు బొప్పెకట్టింది. లేచి మెల్లిగా కంకరమెట్టమీదికి నడిచా. పోతోంది పోతోంది బస్—అలాస్! నాగులూ, ఎలయాస్ మైడియర్ మైడాస్! నువ్వు కూడా వెళ్ళిపోయావా? అరే ఫెయిరీ! నువ్వే మైపోయావ్? ఆ దొరా అని పిలిచింది నన్నేనా?

అదిగో! మైడాసుగాడు. ఈత తోపులోంచి యీలపాట పాడుకుంటూ, ఆల్బగారాపళ్ళు జేబులోపోసుకుని తింటూ వస్తున్నాడు. "ఏంరా నీ కవిత్వం కాలా! వినబడలేదురా హారన్!" అంటూ బుసలుకొడుతున్నాడు. వాడివెనకాల బాజీ తుపాకీతో లెఫ్ట్‌రైట్ కొట్టుకుంటూ వస్తున్నాడు. నన్ను పేల్చెయ్యడుగదా కొంపతీసి తల్లి కొక్కణ్ణి— నాగులుగాడు వైనాక్యులర్సుతో చూసుకుంటూ కానుగమానికి 'డేష్' అయ్యాడు. కెమెరామెన్ తూనీగలు పట్టుకుంటున్నాడు.

బస్సు మిస్సయాం. మర్నాడు ఎనిమిదింటిదాకా బస్సులేదు. 'ఏం వేటాడేరు దొరగారూ?' అంటే బొరుసుమొహం వేశారు. నాగులుగాడు "మనం వెంకటి పాలిటికి పంచమహాపాతకాల్లాగ చుట్టుకున్నాం. ఇప్పుడీ అడవిలో పంచభూతాల్లాగ సంచరించాలి ఈ రాత్రంతా" అన్నాడు. "ఒకే హీనోపమ; మనకేంరా అరణ్యవాసం చేస్తున్న పంచపాండవుల్లా వున్నాం" అన్నాను నేను.

"కాని ద్రౌపదే కొరతా" అన్నాడు మైడాసు మళ్ళా.

"లో! హలో! లోయలో!" అని చూపించాను. అందరికళ్ళూ జిగేల్‌మన్నాయి. ఆవేళరాత్రే వెంకటిహానీమూన్ కూడా


# జీవానందరసాయనము

ఊరుపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహాభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్భలమైన గుహ్యావయవమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు ఋతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

ధనలక్ష్మి అండు కో., సాకారుపేట పోస్టు, మదరాసు.

ను! మైదాను బైనాక్యులర్స్‌తో మహా గ్రీడీగా చూస్తున్నాడు. కెమెరామెన్ ఫోజుకి వెయిట్ చేస్తున్నాడు. దొరగారు తుపాకీ నేలకి మోపెట్టి దానికి గెడ్డాం ఆనించుకుని ఆదేపనిగా చూస్తున్నారు. నాకూ నాగులుకీ మా ప్రాణాలనే సీసపద్యాలకి ప్రాసయతి లాంటివాడు జోగులంటాడు గదా నన్ను "నువు చిన్నప్పుడు ఒకసారి ప్రహసనంలో బృహన్నలవేషం వేశావు. బృహన్నల అంటే అర్జునుడు. అంచాత అర్జునుడేపోయి ద్రౌపదిని సాధించాలి" అన్నాడు. నిజానికి కిది విదూషక పాత్రవంటిది. నిర్వహించడం కష్టమే. అయినా "జై కీర్తిగంభీరా" అని బయల్దేరాను.

ఆమె అవతలి ఒడ్డున కోనేటి బండ మీద కూచుని కాళ్ళతో నీళ్ళు కెలుకుతూ కూనిరాగాలు తీస్తోంది. చేతిలో చీకుతున్న మామిడిపండు. "అదేం రుచి ప్రేయసీ నీకు? కావాలంటే నా హృదయపాత్రలోని ప్రేమామృతం చవిచూడు" అని మనసులో అనుకుంటూ ఎదటిగట్టు చేరా. అక్కడే ఆమె హృదయఫలకంమీద ఫేస్‌టు ఫేస్ నా ప్రేమకవిత్వం డిక్టేటుచేస్తున్నట్లుగా నిలబడ్డానయిదు నిమిషాలు. దాహంమిషతో గట్టు మీద కూచుని ఆపోశనం చేస్తున్నా. ఒక మెసింజరుపిట్ట సాతలమీదనుంచిరొగిరి ఆమె బుజంమీద వాలింది. నేను కచ్చ బిగించి నీళ్ళల్లో దిగుతున్నా. ఆమె విరగబడి నవ్వుతోంది. దూరాన డొంకల్లోంచి మా దుష్టచతుష్టయం వారి రెండు పుంజీల కళ్ళు రెప్పలల్లార్పకండా చూస్తున్నాయి. నేనే మొదట అచ్చతెలుగులో పలకరించాను. నాకు వొచ్చీరాని ఒరియా. ఆమెకు తెలిసీ తెలియని తెలుగు. ఆ రెండూ మిళావ్‌చేసి నాకు తోచినదేవో నాలుగు ముక్కలన్నాను. ఆమె అన్నిటికీ చిఱునవ్వుతోనే జవాబు చెప్పింది. కొంతసేపు యిద్దరం మౌనంగానే నుంచున్నాం. అసలు నేపథ్యంలో జరగవలసిన ఇలాంటి విషయాలు నేత్రావధానంతోనే జరిగిపోగలవు. జరిగిపోతున్నాయి మూగబాసల ముచ్చట్లు. ఇంతలో ఒక్కసారి 'ఢాం' అంది దొరగారి తుపాకీ ఓపికపట్టలేక (Airshot)



ఆమె బెదిరి బేజారై ఒక్కసారి నామీది కొరిగి గట్టిగా పట్టుకుంది నన్ను. 'మరోసారి కానీవోయ్ దొరా గన్‌షాటు! సంజీవీ ఏదీ ఒక్క స్నేప్‌షాటు! అనుకున్నాను. ఆమె జయం అభినయమో, నిజంగా అమాయికమో గాని అదే ఓం ప్రథమంగా తగిలిన స్త్రీ స్పర్శ కాబట్టి ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్లయింది. (కొన్ని జన్మల తరబడి బ్రహ్మచారిగానే వుంటున్నాను గావును!) ఆ షాక్ నుండి తేరుకునేలోపల మేం బసచేసిన బంగళా వాచరు గబగబా మాదెసే వస్తున్నాడు. గుండె గతుక్కుమంది. వాడి చేతిలో పిగిలిపిట్ట తినబోతూన్న గేతు తుప్పునతూలి నామీద వాలింది. కాని వాడు వస్తూనే చిన్న మందహాసం విసిరాడు. ఒక్క పిసరు ధైర్యం వచ్చినది. వాడు తరుచు బరంపురం వస్తుంటాడు కాబట్టి తెలుగు బాగా వచ్చు. "మాట్లాడమంటూరా?" అని అడిగాడు నేను మౌనం. వాడేదో ఆమెతో ఒరియాలో మాట్లాడి నాతో "మనిషి కైదు రూపాయలన్నాడు" నాకు సొమ్మ్‌నేసరికి చాలా అసహ్యమేసింది. ప్రేమని కొనుక్కోవడమేమి టనిపించింది. (అక్కడికి నాకు మహా పదహారణాల పచ్చి ప్రేమ పుట్టుకొచ్చినట్టు!) లేకపోతే ఎన్నడూ ఎఱగని నాపాడు మొహం నట్టడవిలో చూడగానే యెవత్తె ప్రేమించేస్తుంది! అసలు నా సంకోచం ఆమె అడిగినందుకు కాదేమో! నా సొమ్ము పోతుందని భయం. పోనీ ఉభయతారకం కదా అని ఊకొట్టాను. ఇంతలో తయారు మా 'యెవ్వరెడీ' వెధవలు! వాచరుతో వాళ్లతో మాట్లాడారు. అందరం బంగాళావేపు నడిచాం.

చిన్నచిన్న చీకటితెరలు కమ్ముకొస్తున్నాయి. ఆకలవుతోంది. ఆ పూళ్ళో నీళ్ళు కూడా సరిగా పుట్టవు. తెచ్చుకున్న టిఫిన్లు మాత్రం కొద్దిగా వున్నాయి. నాగులుగాడు వాడివాటా కాజేసేసి నాతో కలియబడ్డాడు చాల్లేదని. నాకుమాత్రం చాలుతుందటరా అంటే నీవల్లే వుండిపోయాం కదా మరి అన్నాడు. బయానా పట్టుకెళ్ళిన బంగళా వాచరు రెండు బొప్పాసిపళ్ళు, కొబ్బరి బొండాం, వేరుశనక్కాయలూ, పాలూ

తెచ్చాడు. నాగులుగాడు నన్ను వదిలిపెట్టి పోయాడు—టిఫినయిపోయింది. మైదాసు గాడికి కూటికను కొచ్చింది. దొ తుపాకీ మరామత్తుచేసుకుంటున్నాడు. సంజీవి గూటి లో వాచరు పెంపుడు పావురాలు పొదగడం గమనిస్తున్నాడు. జోగులు బంగళాకి పహరా యిస్తున్నాడు. నేను కారాకిల్లీ ఒహటి బిగించి నా కవిత్వం నిషాలో వున్నాను. అతి సమీపంలోవున్న మధురానుభూతిని గుతించి తలుచుకుంటో. వాచరు వరండామీద కూచుని పొక్కులు చిక్కుకుంటున్నాడు. తుపాకీ బాగయింది గావున దొర ఒక్క ఎయిర్ పాటు కొట్టాడు. అందరం ఒక్కసారి ఆ పక్క చురుకుగా చూశాం. జోగులు 'టైం అయిందని హెచ్చరించాడు. కాని కన్యాశుల్కం! వాళ్లెవరూ పర్సులు పట్రాలేదట! నా పర్సు చూసిగాని కోస్తున్నారో? మామ్మ మడిపంచెలతడి సగం పెళ్ళిలోనే పేకాటలో ఆరిపోయింది. ఇప్పుడు దీనికి పాతికిచ్చేస్తే మాట దక్కదు. ఒక పంచా రాదు. ఏమేనా అంటే నీవల్లే వుండిపోయాం కదా మరి అంటారు, ఎంత నావల్లయినా కడుపుకి పస్తూ, పర్సుకు శాస్తీ రెండూ అయితే పుట్టబోయే పిల్లలవాడిని యెలా చావను! 'ఎట్టకేలకు' బరంపురం బసకు చేరగానే యిచ్చేస్తామన్నారు. మామ్మ రెండో పాతిక్కి పని పట్టించారు. ఎంత ఖరీదూ ఒక్క ఆడది ఒక్కరాత్రికి కాదు ఒక్కసారికి! ఈ వృత్తి పెట్టుకుంటే ఎఫ్ఫెన్సులిచ్చినా రారు నాదగ్గరికి ఒక్కరూ.

వాచరు చూపించిన పాకలోకి మొట్టమొదట దూరాడు మైదాసు. నాకు నిద్రొస్తోందని మిషపెట్టి ఇంత ఉబలాటపడ్డ జోగులూ రొంచాతో నాకక్కరలేదనేసరికి నా కాళ్ళ ర్యాంవేసింది. తరవాత తెలిసింది సంగతి వాడు మావూరు భేషజ మందిరంకి వ్రాసిన వుత్తరం నేను చూట్టం తటస్థించినప్పుడు. వాచరు చేతికి ముందే యిచ్చేశాం సొమ్ము. వాడిప్పుడు ఏకారణంచేతనైనా ఆట ఆగిన యెడల వాపసు యివ్వబడదంటున్నాడు. సరే యేంజేస్తాం? సమయానుకూలముగా రేటు హెచ్చించకండావుంటే చాలు. తరవాత దొరగారు కొంచెం బెట్టుసరి చేసి నా ఆరితేరిన ఘటం సంజీవి కాస్త నచ్చచెప్పి సాగనంపేసరికి వెళ్ళాడు. నేను వెళ్ళేవేళకి పాకలో చీకటి. కొవ్వువత్తి కాలిపోవస్తూంది. దాని గుడ్డివెల్తురులో ఒక వెదురు బొంగుల 'డోలీ' మంచం. దానిమీద బర్త్ డే సూటుతో వగర్పుతో ఒక స్త్రీమూర్తి. నేను బరువుగా ఊపిరి విడిచేసరికి దివ్వె ఆరిపోయింది. మంచం...చేతితో తడుముకుంటున్నాను. నా యిష్టదేవత. సెంటు పెరసెంటు అస్ఖలిత బ్రహ్మచారి ఆంజనేయస్వామి గదతో తుంటిమీద బాదుతున్నట్లయింది, హైరో స్వామీ! నీకు జత కొబ్బరికాయలు కొట్టుకుంటాను!.........గడచిపోయాయి మధుర ఘడియలు......తరవాత తెలిసింది ఆమె వాచరు పెళ్ళామేనట!

బరంపురం చేరుకున్నాం. బిచాణాలు బిగుస్తున్నారు మిత్రులు. దొరదొర కాబట్టి ఒక వరహా యిచ్చాడు. సంజీవి సగం యిచ్చాడు. అవి రైలుఖర్చులికి సరిపోతాయి. మైదానులు "సారీ బ్రదర్! ఇంటికెళ్ళిన వెంటనే మనియార్డరు చేస్తా"మన్నారు. వెరీ వెరీ సారీ మై డియర్ మామ్మా! నీ మడిపంచెలు!

---

# ప్రకటన

చిత్రగుప్త చందాదారులు ఆఫీసుకు ఉత్తరాలు వ్రాయునపుడు తమ చందా నంబరు తప్పక తెలుపవలయును. అలాగుచేసిన ప్రత్యుత్తరము త్వరలో బడయగలరు. తమ చందా నంబరు తెలుపనపుడు ఆఫీసు ఉద్యోగులకు వృథా శ్రమయు, కాలయాపన జరుగుచుండును.

మేనేజరు,
చిత్రగుప్త ఆఫీసు.

---

# * కుసుమ సుందరి *

రచన: మానేపల్లి వెంకటరాజు.

★

రావో!......భ్రమరసుందరా!
నవరేఖాసుమసుందరినోయీ!
కన్నెవలపులా కమ్మనితలపుల
గాలిడోలిలో ఊయలలూగీ
కోరి, కోరి - నే - కొసరి, కొసరినిను
పిలచుచుంటిరా! వినరా!......
నీవులేని ఈ కుసుమ జీవితము
నిలువలేదురా! మధుకరా!......

గీ॥ ఈ వినూత్న కళాముగ్ధ। జీవిత మధు
ధారతో, యుష్మదీయపా। దాభిషేక
మాచరించి తరించెదన్—అందుకొమ్ము
భృంగరాట్చంద్రమమదీయ। ప్రేమపూజ.

యుగయుగాలుగా జగజగాలకూ
కావ్యసుందరుల గానాలాపన
చాటుచుండె మన ప్రేమకథా!
అతిమధురమధుర ప్రణయసుధా!

తీయనివలపుల తేనియలానీ
తేలిపోదమోయీ! ఈరేయీ!
రావో!........భ్రమరసుందరా!

(అన్నిహక్కులు రచయితవి)

